ప్రజాశక్తి

బుధవారం 11 అక్టోబర్ 2023

పారాది వంతెనపై రాకపోకలకు అనుమతి

10 మెట్రిక్ టన్నుల లోపు ప్రయాణికుల వాహనాలకే

ప్రజాశక్తి-విజయనగరం

గత కొద్దిరోజులుగా రాకపోకలు నిలిపివేసిన బొబ్బిలి మండలంలోని పారాది వంతెనపై బుధవారం నుంచి ప్రయాణీకుల వాహనాలకు అనుమతించనున్నట్టు రోడ్లు భవనాల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ కె.విజయరత్నం తెలిపారు. రోడ్డు వంతెన బలహీన పడటంతో గత వారం రోజులుగా ఈ వంతెనపై భారీ వాహనాల రాకపోకలను నిలిపివేయడం జరిగిందన్నారు. ఈ వంతెనకు గత వారంరోజులుగా అత్యవసర మరమ్మత్తులు చేపట్టి తాత్కాలికంగా పునరుద్ధరించామన్నారు. ఈనెల 11 నుంచి ఈ వంతెనపై బస్సులు, కార్లు, ఇతర ప్రయాణీకుల వాహనాలను మాత్రమే అనుమతించడం జరుగుతుందన్నారు. పదిటన్నుల లోపల బరువు కలిగిన వాహనాలు మాత్రమే అనుమతిస్తామని, లారీలు, ట్రక్కులు తదితర సరుకు రవాణా వాహనాలు అనుమతించేది లేదని అన్నారు. ఈ విషయాన్ని ఈ మార్గంలో ప్రయాణించే వారు గుర్తించాలని కోరారు. వంతెన పై పది కిలోమీటర్ల వేగంతోనే ప్రయాణించ వలసి ఉంటుందని సూచించారు.

నకిలీ పట్టాలపై దర్యాప్తు

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో నకిలీ ఇళ్ల పట్టాలపై రెవెన్యూ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఇందిరమ్మ కాలనీలో నకిలీ ఇళ్ల పట్టాలతో ఇళ్ల స్థలాలను కబ్జా చేసి అమ్మేస్తున్నట్లు ఆరోపణలు రావడంతో ఆర్‌డిఒ శేషశైలజ ఆదేశాల మేరకు దర్యాప్తు కోసం నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. నాలుగు బృందాలు ఇంటింటికి వెళ్లి పట్టాలను పరిశీలిస్తున్నాయి. నకిలీ పట్టాలు నిర్ధారణ అయితే చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ రాజేశ్వరరావు చెప్పారు. నకిలీ పట్టాలపై దర్యాప్తుతో అక్రమార్కుల్లో గుబులు పుడుతోంది.

నేడు ఎల్.కోటలో జగనన్నకు చెబుదాం

విజయనగరం : మండల స్థాయిలో ప్రజా వినతులు స్వీకరించి పరిష్కరించే చర్యల్లో భాగంగా జగనన్నకు చెబుదాం ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమం బుధవారం లక్కవరపు కోట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. మండల ప్రజానీకం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

సహకార వ్యవస్థను పటిష్టపరచాలి

కలెక్టర్ నాగలక్ష్మి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలోని సహకార వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వ శాఖలు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. జిల్లా సహకార అభివృద్ధి కమిటీ (డిసిడిసి), జిల్లా స్థాయి అమలు కమిటీ , పిఎసిఎస్ కంప్యూటరైజేషన్ అమలు, మోనటరింగ్ కమిటీ మంగళవారం కలెక్టరేట్‌లో వరుసగా జరిగాయి. సమావేశాల్లో కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, సహకార సంఘాలను బలోపేతం చేసి, వాటి ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కొన్ని సంఘాల కార్యకలాపాలు నామమాత్రంగా ఉన్నాయని, ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధునిక సౌకర్యాలను వినియోగించుకొని వాటి పరిధిని, కార్యకలాపాలను పెంచాలని సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలో ఏర్పాటైన సహకార సంఘాల కార్యకలాపాలపై ఆరా తీశారు. సహకార సంఘాల కంప్యూటరైజేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న బిసి వెల్ఫేర్, పశు సంవర్ధకశాఖ పరిధిలోని సంఘాల కంప్యూటర్ ప్రక్రియను కూడా వెంటనే పూర్తి చేయాలని చెప్పారు. గోదాముల నిర్మాణంపై దృష్టి పెట్టి త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

జిల్లా సహకార అధికారి పి.రమేష్ మాట్లాడుతూ, ఈ మూడు కమిటీల కార్యకలాపాలను, ఆయా కమిటీల్లోని సభ్యుల పాత్రను వివరించారు. కంప్యూటరైజేషన్ ప్రక్రియ దాదాపు పూర్తి అయ్యిందని తెలిపారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ట్రైనీ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిపిఒ నిర్మలాదేవి, జిల్లా వ్యవసాయాధికారి తారకరామారావు, ఉద్యాన శాఖాధికారి జమదగ్ని, పశు సంవర్ధకశాఖ డిడి వైవి రమణ, మత్స్యశాఖ డిడి నిర్మలా కుమారి, మత్స్యకార ఫెడరేషన్ ప్రతినిధి బర్రి చిన్నప్పన్న, నాబార్డ్ డిడిఎం నాగార్జున, సివిల్ సప్లయిస్ డిఎం మీనాకుమారి, డిసిఎంఎస్ మేనేజర్ రమేష్, డిసిసిబి సిఇఒ, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

విద్యుత్తు భారాన్ని ప్రతిఘటించండి

వామపక్ష పార్టీల పిలుపు ● 13న రౌండ్ టేబుల్ సమావేశం

రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ ఛార్జీలను ప్రజలంతా ప్రతిఘటించాలని వామపక్షాల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, సిపిఐఎంఎల్ నాయకులు బి.శంకర్రావు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఒకేసారి సర్దుబాటు ఛార్జీల పేరుతో మూడు పోట్లు పొడిచిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కయి ప్రజలకు షాక్ ఇస్తున్నాయని అన్నారు.. గత ఏడాది కరెంటు ఛార్జీలు పెంచి ప్రజలపై రూ.1400 కోట్ల భారం మోపిందన్నారు. ప్రజల కళ్లు కప్పి గత పదేళ్ల నుంచి వాడుకున్న కరెంటుకు బిల్లులు కట్టినా మళ్లీ సర్దుబాటు ఛార్జీల పేరుతో జనం నెత్తిన వేశారన్నారు. నాలుగేళ్లలో రూ.25 వేల కోట్లు ప్రజల నెత్తిన భారం మోపారన్నారు. మోడీ ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయిన జగన్ ప్రభుత్వం ప్రతి నెలా వంటగ్యాస్ లాగానే కరెంటు ఛార్జీలు కూడా పెంచడానికి ఆదేశాలు ఇచ్చేశారన్నారు.

విద్యుత్తు ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా బుధవారం నుంచి ప్రజలను చైతన్య వంతులను చేసి భవిష్యత్ పోరాటాలకు సిద్ధమవుతామని పిలుపు నిచ్చారు. అందులో భాగంగా ఈనెల 13న అన్ని పార్టీలు, ప్రజా సంఘాలతో కలిపి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు టివి రమణ, లక్ష్మి పాల్గొన్నారు.

ఆక్సైడ్ ప్లాంట్ మూసేయొద్దు

కార్మికులను రోడ్డున పడేసే నిర్ణయాన్ని విరమించుకోవాలి ● కలెక్టరేట్ వద్ద సిఐటియు ధర్నా

ధర్నా చేస్తున్న కార్మికులు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గరివిడి ప్రాంతంలోని అర్‌ఎంఎం అండ్ అర్‌బిఎస్, డిఎఫ్ఎన్ కంపెనీలో భాగంగా ఉన్న ఆక్సైడ్ ప్లాంట్ మూసివేత నిర్ణయాన్ని యాజమాన్యం వెనక్కి తీసుకోవాలని, మూసివేతకు జిల్లా అధికార యంత్రాంగం అనుమతులు ఇవ్వొద్దని కంపెనీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు ఎ.గౌరినాయుడు, సిఐటియు జిల్లా నాయకులు టివి రమణ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఆ యూనియన్ ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. 25 ఏళ్లగా నడుస్తున్న ఆక్సైడ్ కంపెనీని ఉన్న పళంగా యాజమాన్యం మూసేయలని నిర్ణయించడం దారుణమన్నారు. 110 మంది కార్మికులు 25 ఏళ్లుగా పని చేస్తున్నారన్నారు. రక రకాల కారణాలు చెప్పి మూసేయాలని నిర్ణయానికి రావడం సరికాదన్నారు. మరో వైపు అదే యాజమాన్యానికి అదే ప్రాంతంలో ఫెర్రో ఎల్లాయిస్, రాధిక పామాయిల్ కంపెనీలు ఉన్నాయని, కార్మికులకు ఇతర కంపెనీలో పని కల్పించాలని కోరినా యాజమాన్యం ఉన్నపలంగా మూసేస్తామని నోటీసు ఇవ్వడం అన్యాయమన్నారు.కార్మికులు రోడ్డున పడేసే విధంగా యాజమాన్యం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, జిల్లా అధికార యంత్రాంగం కూడా మూసి వేసేందుకు అనుమతులు ఇవ్వొద్దని డిమాండ్ చేశారు. ధర్నాలో కె.లక్ష్మునాయుడు, ఎస్.చిరంజీవి, బి.అప్పలనాయుడు, తవుడు, సత్యం, అప్పారావు, ఎల్లయ్య, రాజు, ప్రసాద్, సూర్యనారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న డివిజి శంకరరావు

ఆశ్రమ పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి-గంట్యాడ

తాటిపూడిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలలో ఆహారం, తాగునీరు, కిచెన్, క్లాస్ రూమ్స్ లను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా, లేదా అనే విషయంలో నేరుగా విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థుల విద్యా ప్రమాణాలపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు.

రాష్ట్ర పరిణామాలపై

రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలి

టిడిపి

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై రాష్ట్రపతి, గవర్నర్ ప్రధానమంత్రి జోక్యం చేసుకోవాలని టిడిపి జిల్లా నాయకులు కోరారు. మంగళవారం సాయంత్రం టిడిపి కార్యాలయం అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, నగర అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు మాట్లాడారు. చంద్రబాబు నాయుడును 32 రోజులు పాటు అక్రమంగా జైలులో ఉంచారని, ఈ సైకో ముఖ్యమంత్రి కావాలనే ఇలా చేశారని అన్నారు. లక్షల కోట్లు దిగమింగిన నాయకులు బెయిల్‌పై బయట తిరుగుతున్నారని అన్నారు. దేశాన్ని పరిపాలిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఒకసారి రాష్ట్రం వైపు చూడాలని అన్నారు. రాష్ట్రంలో ఫైబర్ నెట్‌కు రూ.5000 కోట్లు ఖర్చు కావాల్సి ఉండగా, కేవలం రూ.300 కోట్లతోనే పూర్తి చేసి రాష్ట్రానికి ఫైబర్ నెట్ అందించిన ఘనత చంద్రబాబుది అన్నారు. రానున్న రోజుల్లో ప్రజాక్షేత్రంలోకి వెళ్లి ప్రజల మధ్యనే తేల్చుకుంటామని అన్నారు. చంద్రబాబుకు జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తామని తెలిపారు. సమావేశంలో నగర కార్యదర్శి బంగారు బాబు, నాయకులు కనకల మురళీమోహన్, కంది మురళీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో నాణ్యతలేని ఆహారం

కుళ్లిన గుడ్లు ● అప్పడాల్లాంటి పూరీలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

కుళ్లిపోయిన గుడ్లు

మండలంలోని తాటిపూడి వద్దనున్న గురుకుల విద్యార్థులకు నాణ్యతలేని భోజనం పెడుతున్నారు. ఇటీవల ఆ గురుకులాన్ని 'ప్రజాశక్తి' సందర్శించగా దిమ్మతిరిగే వాస్తవాలు కనిపించాయి. అల్పాహారంలో మెనూ ప్రకారం పూరి, ఆలు బఠాణి కుర్మా, ఉడకబెట్టిన గుడ్డు విద్యార్థినులకు ఇవ్వాలి. అప్పడాలు లాంటి పూరీలు, కుళ్లిన కోడి గుడ్లు, రసం వల్లే పలచగా ఆలు బఠానీ కుర్మా వంటశాలలో కనిపించాయి. కోడి గుడ్లు సైజులోనూ చేతివాటం చూపిస్తున్నారు. అంతేకాకుండా గోధుమ పిండితో పూరీలు విద్యార్థినులతో తయారు చేయిస్తున్నారు. వసతిగృహ స్టాక్ పాయింట్ కూడా సరిగా లేదు. వాడిపోయిన కూరగాయలు, ఎండిపోయిన ఆకుకూరలు కనిపించాయి. సుమారు నెలరోజుల కిందట ఈ గురుకులాన్ని సందర్శించిన ఆహార భద్రతా కమిషన్ సభ్యులు కాంతారావు విద్యార్థినులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కొద్ది రోజుల్లో మళ్లీ గురుకుల పరిశీలనకు వస్తానని, సిబ్బంది తీరు మారకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అయినా, విద్యార్థినులకు ఆహారం అందించడంలో మార్పు రాలేదు. గురుకులంలోని విద్యార్థులలో రక్తహీనత ఎక్కువగా ఉన్నట్టు కనిపిస్తుంది. ఉదయం 10 గంటల వరకు అల్పాహారం పెట్టలేదు. ఈ సమయంలో గురుకులంలో నర్స్ మాత్రమే ఉన్నారు. వార్డెన్ గాని, ప్రిన్సిపల్ గాని స్థానికంగా లేరు. ప్రిన్సిపల్ సంధ్యా భార్గవికి ఫోన్ చెయ్యగా 10 గంటల తర్వాత గురుకులానికి వస్తానని చెప్పారు. విద్యార్థినులతో పనులు చేయిస్తున్నారని ప్రశ్నించగా, అటువంటిదేదీ లేదని అంతా నాణ్యంగా చేస్తున్నామని ఆమె బదులీయడంతో గురుకుల విద్యార్థినుల పట్ల సిబ్బంది వైఖరి తేటతెల్లమైంది.

ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

ఆరోగ్య సురక్షలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనేక సంస్కరణలు తీసుకొస్తున్నారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని కంటోన్మెంట్ హైస్కూలు ప్రాంతంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. 47, 48, 49 సచివాలయాల పరిధిలో ప్రజలు వైద్య శిబిరానికి చేరుకున్నారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు ఉచితంగా అందజేసారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్చార్జి డాక్టర్ వి ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. నగరంలో ఏడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజల ఆరోగ్యం పట్ల ముఖ్యమంత్రికి ఉన్న చిత్తశుద్ధి రుజువు చేస్తుందన్నారు. 15వ తేదీ వరకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచిత వైద్య చికిత్సలు, వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వింత ప్రభాకర్ రెడ్డి, కమీషనర్ ఆర్ శ్రీరాములు నాయుడు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, జోనల్ ఇన్చార్జి దూబే, డివిజన్ల కార్పొరేటర్లు సుంకరి నారాయణస్వామి, ధనలక్ష్మి, కోఆప్షన్ సభ్యులు రహీం, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రహదారులు ప్రారంభం

నగరంలోని 9, 20వ డివిజన్లలో సుంకరవీధి, శాంతినగర్‌లో నిర్మించిన రహదారులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మంగళవారం ప్రారంభించారు.

మందులను పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పర్యటించిన సందర్భంలో స్థానికుల వినతి మేరకు రహదారి ఏర్పాటుకు కోలగట్ల హామీ ఇచ్చారు. పనులు పూర్తి కావడంతో రహదారులను ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నగరం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, స్థానిక కార్పొరేటర్ సయ్యద్ గౌస్, జోనల్ ఇన్చార్జి అల్లు చాణిక్య, వైసిపి నాయకులు నాయన మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ వారికి ఆరోగ్య మిత్రలకు జతచేయాలి

విజయనగరంటౌన్, జామి : జగనన్న ఆరోగ్య సురక్ష కాంప్‌ల్లో ఆరోగ్య శ్రీ కింద రిఫర్ చేయవలసి వచ్చిన వారికి ఆరోగ్య మిత్రలను జత చెయ్యాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ జామి మండలం లోట్లపల్లి , విజయనగరం అరుంధతినగర్ మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను తనిఖీ చేశారు. శిబిరం వద్ద ఏర్పాటు చేసిన పలు కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. రోగులతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడుతూ ఏడు రకాల పరీక్షలను నిర్వహించి, హెల్త్ ప్రొఫైల్‌లో వారి వివరాలను నమోదు చేయాలని, అవసరమైన వారికి కేస్ షీట్లను అందించాలని తెలిపారు. శిబిరాల్లో ఇసిజితో సహా మొత్తం 14 రకాల పరీక్షలను నిర్వహించి, 105 రకాల మందులను ఉచితంగా ఇవ్వాలని తెలిపారు. కంటి పరీక్షలను కూడా నిర్వహించి, అవసరమైనవారికి ఉచితంగా కళ్లద్దాలను కూడా అందజేయాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున శిబిరాల వద్ద తాగునీరు, స్నాక్స్ వంటివి ఏర్పాటు చేయాలని, వచ్చిన వారిని వేగంగా పంపించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. విజయనగరం అరుంధతి నగర్ లో 47, 48, 49 సచివాలయాలకు చెందిన సుమారు 2 వేల మంది, లోట్లపల్లి శిబిరం లో 271 మంది తనిఖీలు చేయించుకున్నారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కరరావు, మున్సిపల్ కమిషనర్ శ్రీ రాములు నాయుడు, డిసిహెచ్ఎస్ డాక్టర్ గౌరీశంకర్, ఆరోగ్య శ్రీ కో ఆర్డినేటర్ అప్పలరాజు, జామి ఎంపిడిఒ సతీష్, తహశీల్దారు హేమంత్ కుమార్, వైద్యులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

విజయనగరం టౌన్ : నగరంలోని జరుగుతున్న వివిధ అభివద్ధి పనులను కమిషనర్ ఆర్ శ్రీరాములనాయుడు ఆకస్మిక తనిఖీ చేశారు. పనుల్లో నాణ్యతను పరిశీలించారు. మంగళవారం దాసన్నపేట, ప్రశాంతి నగర్,ద్వారకా నగర్, సింగపూర్ సిటీ తదితర ప్రాంతాలలో పర్యటించి అక్కడ నిర్మితమవుతున్న కాలువలు, బిటి రోడ్ల తీరును అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాలలో జరుగుతున్న రోజువారి పారిశుధ్య పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివద్ధి పనుల్లో పూర్తి నాణ్యత ప్రమాణాలు పాటించాల్సిందేనని చెప్పారు. ఆయనవెంట ఇఇ శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ సిబ్బంది, పారిశుధ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

కెజిబివిలో తాగునీటి సమస్య

మెంటాడ : నాలుగు రోజులుగా కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో తాగునీటి సమస్య నెలకొంది. విద్యార్థినులు పడుతున్న ఇబ్బందులను చెక్ చైర్మన్ సిహెచ్ కృష్ణవేణి అదికారులు దృష్టికి తీసుకెళ్లారు. మోటార్ మరమ్మతులకు గురైంది. అయినా పాఠశాల యాజమాన్యం చొరవ తీసుకోలేదు. ఈ విషయంలో అదనపు మోటార్ కొనుగోలు చేసి రిజర్వులో ఉంచాలని సిపిఎం మండల కార్యదర్శి రాకోటి రాములు, పాఠశాల విద్యాకమిటి చైర్మన్ సిహెచ్.కృష్ణ... ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు, తహశీల్దార్ రామకృష్ణను కోరారు.

పంటలను పరిశీలిస్తున్న జెసి మయూర్ అశోక్, జిల్లా వ్యవసాయాధికారి రామారావు

ఇ-పంట నమోదు వేగవంతం

పంటల పరిశీలనలో జెసి మయూర్ అశోక్

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఇ-పంట నమోదు త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ వ్యవసాయ శాఖ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మండలంలోని సీతారామునిపేట, రామతీర్థం, ఆత్మరాముని అగ్రహారంలో వరి పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ బయోమెట్రిక్ నమోదు శతశాతం పూర్తి చేయాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి విటి రామారావు మాట్లాడుతూ మండలంలో మొత్తం 8250 ఎకరాల్లో పంటలను ఇ-క్రాప్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. విఎఎ, విఆర్ఒ బయోమెట్రిక్ 100 శాతం, రైతులు బయోమెట్రిక్ 90 శాతం అయిందని జెసికి వివరించారు. ఇ-పంటలో నమోదు చేసుకున్న ప్రతి రైతూ బయోమెట్రిక్ వేసుకోవాలని చెప్పారు. వారికే ధాన్యం కొనుగోలు, పంటలు బీమా, సున్నావడ్డీ పంట రుణాలు, పంట నష్టపరిహారం, వ్యవసాయ సబ్సిడీలు వర్తిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఎడి ఎన్ కోటేశ్వరరావు, తహశీల్దార్ డి.ధర్మరాజు, ఎఒ ఎం.పూర్ణిమ, ఎఇఒ కూర్మారావు, నాగరాజు, విఆర్ఒ టి.శివప్రసాద్, విఎఎ శ్యామ్‌కుమార్, చంద్రరావు, శివకుమార్, సర్పంచ్ రామారావు, రైతులు పాల్గొన్నారు.

ఎపి ఫుట్‌బాల్ జట్టుకు రామకృష్ణ

ప్రజాశకి-నెల్లిమర్ల

రామకృష్ణ

ఫుట్‌బాల్ రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల జట్టుకు నెల్లిమర్లకు చెందిన బి రామకృష్ణ ఎంపికయ్యాడు. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఈ నెల 13 నుంచి ఫుట్‌బాల్ జాతీయ ఛాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టులో రామకృష్ణ ఆడనున్నాడు. ఈ నేపథ్యంలో రామకృష్ణను కోచ్‌లు శేఖర్, సురేష్, నాని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా మంది ఎన్‌ఆర్ఎఫ్‌సి క్రీడాకారులు జాతీయస్థాయిలో ప్రతిభ చూపారని తెలిపారు. తోటి సీనియర్ క్రీడాకారుల సహకారంతో నెల్లిమర్ల ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ప్రతిరోజూ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తే మరింతగా రాణిస్తారన్నారు.

13న బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు

ప్రజాశక్తి-శంగవరపుకోట

ఈ నెల 13న వెంకటరమణపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి అండర్-14, 17 బాల, బాలికల బాస్కెట్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఇందుకూరి అశోక్‌రాజు, వ్యాయామ ఉపాధ్యాయులు పి.శ్రీరాములు, గణేష్, జగదీశ్వరరావు, సురేంద్ర తెలిపారు. హెచ్ఎం ఎన్.లక్ష్మి ఆధ్వర్యంలో జిల్లా స్కూల్ గేమ్స్ అసోసియేషన్ సహకారంతో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. బాలురు, బాలికలు 13న ఉదయం 9 గంటలకల్లా మైదానానికి క్రీడా దుస్తులతో హాజరుకావాలని కోరారు. క్రీడాకారులకు, వ్యాయామ ఉపాధ్యాయులకు భోజన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

శాస్త్రీయ ఆలోచనను పెంపొందించాలి

బాలల సైన్స్ కాంగ్రెస్ అవగాహన సదస్సులో డిప్యూటీ డిఇఒ వాసుదేవరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనను పెంపొందించుకోవాలని డిప్యూటీ డిఇఒ కె.వాసుదేవరావు అన్నారు. విజయనగరం డివిజన్ సైన్స్ ఉపాధ్యాయుల అవగాహన సదస్సు పూల్‌బాగ్‌లోని శ్రీ చలపతి ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో మంగళవారం జరిగింది. 215 మంది సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. జిల్లా సైన్స్ సమన్వయకర్త యం.కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ ఈ సదస్సులో డిప్యూటీ డిఇఒ మాట్లాడారు. ఉపాధ్యాయులు సమాజ శ్రేయస్సు కోరి ప్రాజెక్టులు తయారు చేయించాలన్నారు. శాస్త్రీయ దక్పథం పెంచే విధంగా విద్యార్థులను తయారు చేయాలన్నారు. 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రధాన అంశంగా ఆరోగ్యం, సంక్షేమం కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవటం. పర్యావరణ వ్యవస్థ గూర్చి తెలుసుకోవడం, ఆరోగ్యం పోషణ, సంక్షేమాన్ని పెంపొందించడం, పర్యావరణ వ్యవస్థ మరియు ఆరోగ్యం కోసం సామాజిక మరియు సాంస్కృతిక పద్ధతులు వంటి అంశాలు ఉన్నాయని తెలిపారు. రిసోర్స్ పర్సన్ లుగా టి.రాజేష్, బి.వేణు, ఎ.సురేంద్ర, ఎస్. రామ, కె. సురేష్ కుమార్, పాఠశాల కరస్పాండెంట్ రాజేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ వాసుదేవరావు

బ్యాడ్మింటన్‌లో విద్యుత్తు ఉద్యోగులకు పతకాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తెలంగాణ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో 45వ ఆలిండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ కంట్రోల్ బోర్డ్ అథ్లెటిక్స్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు హనుమకొండ జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో ఈనెల 5న జరిగాయి. ఈ పోటీల్లో విజయనగరం సర్కిల్ నుంచి జూనియర్ అసిస్టెంట్ పి.అనిల్ కుమార్ 400 మీటర్లు, 100క్ష్మి4 మీటర్ల రిలేలో గోల్డ్ మెడల్, 100 మీటర్ల పరుగు పందెంలో బ్రాంజ్ మెడల్ సాధించారు.

బొబ్బిలి ఇఆర్ఒ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎన్. సాయికుమార్ లాంగ్ జంప్‌లో పాల్గొన్నారు, జెఎల్ఎం కె.మణిబాబు బాల్ బ్యాడ్మింటన్‌లో ద్వితీయస్థానం సాధించాడు. వీరికి స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్, ఎస్ఇ ఎం. లక్ష్మణరావు , జనరల్ సెక్రటరీ ఇఇ పి. హరి, గేమ్స్ కార్యదర్శి మోహన్ బాబు తదితరులు అభినందించారు.

ఎక్కడికక్కడే స్తంభిస్తున్న ట్రాఫిక్

ప్రజాశక్తి-బొబ్బిలి

పారాది వంతెన కుంగిపోవడంతో భారీ వాహనాలను దారి మళ్లించిన విషయం తెలిసిందే. దీంతో బొబ్బిలి, రామభద్రపురం, బాడంగి, తెర్లాం మండలాల్లో ట్రాఫిక్ ఎక్కడికక్కడే స్తంభిస్తోంది. ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు, ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పారాది వంతెన కుంగిపోవడంతో ఆటోలు, కార్లు, ఆర్‌టిసి బస్సులు, లారీలను రామభద్రపురం నుంచి బాడంగి మండలం ఆకులకట్ట మీదుగా కొన్ని వాహనాలను, తెర్లాం మీదుగా కొన్ని వాహనాలను తరలిస్తున్నారు. ఇరుకు రోడ్లలో భారీ వాహనాల రద్దీ పెరగడంతో ఆయా రోడ్లలో ఎక్కడికక్కడే ట్రాఫిక్ స్తంభిస్తోంది. అధికారులు స్పందించి ట్రాఫిక్ స్తంభించకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సచివాలయ పేరు మార్పుపై వినతి

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని గనిశెట్టిపాలెం సచివాలయ పేరును గులివిందాడగా మార్పు చేయాలని ఎపి స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎమ్‌డి లక్ష్మీశాకు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయం పేరు గులివిందాడకు బదులు గనిశెట్టిపాలెంగా పడిందని తెలిపారు. ఈ విషయమై చర్యలు తీసుకుంటామని లక్ష్మీశా తెలిపారు.

13న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 13న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సి.హెచ్.కేశవరావు, జెకెసి కోఆర్డినేటర్ జి.ఈరన్న ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాకు పదో తరగతి నుంచి పీజీ పూర్తి చేసిన 18 నుండి 30 ఏళ్ల విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డుతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళాకు హాజరు కావాలని తెలిపారు. ఈ జాబ్‌మేళాకు ఎటిసి టైర్స్ ఎపి ప్రైవేట్ లిమిటెడ్, అరబిందో ఫార్మా, సెనప్టిక్స్ ల్యాబ్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, జయభేరి ఆటోమోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్, రాండ్ స్టాండ్, నవత రోడ్ ట్రాన్స్పోర్ట్, అపోలో ఫార్మసీ, ముత్తూట్ ఫైనాన్స్, స్మార్ట్ సర్వీసెస్ వంటి ప్రముఖ కంపెనీలు హాజరుకానున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలుకు 7995691295 నంబరును సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ భవన నిర్మాణాల పరిశీలన

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలో నిర్మాణాల్లో ఉన్న సచివాలయ భవనాలు, వెల్‌నెస్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలను జిల్లా పంచాయతీరాజ్ ఇఇ కె.జి.జగన్నాథ నాయుడు మంగళవారం పరిశీలించారు. రాజాపులోవ పంచాయతీలో నిర్మాణంలో ఉన్న వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలించారు. భవనం నిర్మాణాన్ని వేగవంతం చేసి పూర్తి చేయాలని మాజీ ఎంపిటిసి కిలారి వెంకటరమణకు సూచించారు. అనంతరం గుడివాడ పంచాయతీలో ఈ నెల 13న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ప్రారంభోత్సవం చేయనున్న సచివాలయ భవనాన్ని పరిశీలించారు. గదుల్లోకి వెళ్లి ప్రభుత్వం ఇచ్చిన ప్రకారం నిర్మించినది, లేనిది పరిశీలించారు. ఏమైనా పనులు మిగిలి ఉంటే 13వ తేదీలోగా పూర్తి చేయాలని మాజీ సర్పంచ్ దాసరి చంద్రశేఖర్ రెడ్డికి సూచించారు. కవులువాడలో రైతు భరోసా కేంద్రాన్ని, సచివాలయ భవనాన్ని, భోగాపురంలో వెల్‌నెస్ సెంటర్‌తో పాటు రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. నిర్మాణాలు వేగవంతం చేసి తొందరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఆయన వెంట డిఇ బంగారు నాయుడు, జెఇ చంద్రునాయుడు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

కర్లాంలో పశువైద్య శిబిరం

ప్రజాశక్తి-చీపురుపల్లి

మండలంలోని కర్లాం గ్రామంలో ఆజాద్ కి అమృత్ మహోత్సవం లో భాగంగా శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వ విద్యాలయం, పశువైద్య కళాశాల, జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా నిర్వహించిన పశు వై ద్య శిబిరాన్ని మంగళవారం జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ ప్రారంభించారు. అనంతరం పాడి రైతులకు మండలు పంపిణీ చేశారు. కర్లాం ఇండియన్ బ్యాంకు పరిధిలో 45 మహిళా సంఘాలకు రూ.8.10కోట్ల చెక్కును అందజేశారు. డెయిరీ యూనిట్ పశు సంవర్ధకశాఖ 24 మంది లబ్ధిదారులకు మంజూరు చేసిన రూ.23.50లక్షల చెక్కును పంపిణీ చేశారు. అనంతరం కరకాం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ ఎడి రమణ, గరివిడి పశువైద్య కళాశాల డీన్ శ్రీనివాస్, ఎంపిపి ఇప్పిలి వెంకట నరసమ్మ, జడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష, మండల నాయకులు ఇప్పిలి అనంత్, వలిరెడ్డి శ్రీనివాస్ నాయుడు, బెల్లాన వంశీ, అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి సూచికలపై సమావేశం

ప్రజాశక్తి-తెర్లాం

పంచాయతీల అభివృద్ధి సూచికలపై మండల అధికారులతో ఎంపిడిఒ ఎస్.రామకృష్ణ అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. పంచాయతీల సమగ్ర అభివృద్ధి, పనితీరు, పురోగతిని అంచనా వేయడానికి సూచికలను ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ తెలిపారు. ఈ సందర్భంగా అధికారులతో ఆయా అంశాలపై చర్చించారు.

కలాం విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలోని తంగుడుబిల్లిలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం విగ్రహాన్ని మంగళ వారం సర్పంచ్ పిన్నింటి చిన్న అప్పలనాయుడు, ఎంపిటిసి చందక చిన్నంనాయుడు ప్రారంభించారు. జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో హెచ్ఎం చందక నారాయణరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఇఒ కురిమినేని రాజేశ్వరరావు, కుటుంబ సభ్యులు చందక సత్యవతి ,మహాలక్ష్మి, కృష్ణ, ప్రధానోపాధ్యాయులు ఆర్.సత్యం, వైస్ సర్పంచు ఆర్.నారాయణరావు, మాజీ సర్పంచ్ కె.వెంకటరమణ పాల్గొన్నారు.

బస్‌టైర్ల సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం కోట

టైర్ల సంరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆర్‌టిసి జోనల్ వర్క్‌షాప్‌లో జోనల్ ఇడి సిహెచ్ రవికుమార్‌కు సిబ్బందికి అవగాహన కల్పించారు. గత ఏడాది 232 టైర్లు జనతా గ్యారేజ్ ద్వారా ఉత్పత్తి చేయడం ద్వారా రూ.10.78 లక్షలు ఆదాయం వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో వర్క్స్ మేనేజర్ వరలక్ష్మి, అసిస్టెంట్ మెకానిక్ మేనేజర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలో బొడ్డవర చెక్‌పోస్ట్ వద్ద ఎస్ఇబి సిఐ ధర్మారావు ఆధ్వర్యంలో మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్స్పెక్టర్ ఎన్.రాజేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. గంజాయి, డ్రగ్స్ వంటి నిషేధిత పదార్థాల రవాణా అరికట్టేందుకు తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇబి ఎస్ఐ ఎన్.రమ్యశ్రీ, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

నేడు బైక్ వేలం

ప్రజాశక్తి-డెంకాడ

స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కేసులో పట్టుబడి సీజ్ చేసిన మోటార్ సైకిల్‌ను ఈ నెల 12న విజయనగరం 2వ పట్టణ పోలీస్ స్టేషన్లో వేలం వేయనున్నట్లు ఎఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా వేలం వేస్తారని, కావాల్సిన వారు పాల్గొనాలని కోరారు.

జెఎస్‌తో ఆరోగ్య భరోసా

ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

మెరకముడిదాం.. మందులు అందజేస్తున్న బొత్స సందీప్

ప్రజాశక్తి-భోగాపురం

రాష్ట్రంలో పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించడమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని ఎ.రావివలస సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఉప్పాడ శివారెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. 454 మంది పరీక్షలు చేయించుకోగా, నలుగురిని రిఫర్ చేసినట్లు పోలిపల్లి వైద్యాధికారి తిరుపతిస్వామి తెలిపారు. మరో 22 మందికి కంటి పరీక్షలు చేయగా కంటి అద్దాలు అవసరమని గుర్తించామన్నారు. అనంతరం అంగన్వాడీ స్టాళ్లను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎన్.అప్పలనాయుడు, తహశీల్దార్ చింతాడ బంగార్రాజు, సవరవల్లి సర్పంచ్ ఉప్పాడ విజయ భాస్కర్ రెడ్డి, ఇఒపిఆర్‌డి సురేష్, ఎంఇఒలు రమణమూర్తి, చంద్రమౌళి, ఎపిఒ ఆదిబాబు, ఎపిఎం రమణ తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : బురాడపేటలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ప్రారంభించారు. ప్రజల ఆరోగ్య పరిస్థితులను, వారికి చేస్తున్న వైద్య పరీక్షలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ల సుధారాణి, జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములు నాయుడు, మండల అధ్యక్షులు చనుమల్ల వెంకటరమణ, వైస్ ఎంపిపిలు సారికి వైకుంఠంనాయుడు, పతివాడ సత్యనారాయణ, టూరిజం డైరెక్టర్ రేగాన శ్రీనివాస్‌రావు, తుమ్మలపేట పిఎసిఎస్ అధ్యక్షులు కోట్ల పైడినాయుడు, ఎంపిడిఒ రామారావు, తహశీల్దార్ డి.ధర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : దేశపాత్రునిపాలెం సచివాలయంలో ఆరోగ్య సురక్ష ఉశిబిరంలో 501 మందికి తనిఖీలు చేసినట్లు వైద్యాధికారి డి.సీతల్‌వర్మ తెలిపారు. సర్పంచ్ దళాయి లక్ష్మి ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పద్మజ, డిప్యూటీ తహశీల్దార్ రమేష్, మాజీ ఎంపిపి గొరపల్లి శివ, ఎంపిటిసి కె.లక్ష్మి, వైస్ సర్పంచ్ ఏడువాక నారాయణ పాల్గొన్నారు.

మెరకముడిదాం : మండలంలోని బైరిపురంలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఏర్పాటుచేశారు. 426 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ధీర ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ సందీప్, నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్‌వి రమణరాజు, కెఎస్ఆర్‌కె ప్రసాద్, ఎంపిడిఒ రత్నం, డిటి గిరిధర్, సర్పంచ్ పప్పల విజయ కుమారి, ఉపసర్పంచ్ పప్పల క్రిష్ణమూర్తి, పప్పల గ్రహణేశ్వరరావు, కందుల మల్లికార్జునరావు, వైస్ ఎంపిపి కందుల పార్వతి, డాక్టర్ అజయ్ కుమార్, డాక్టర్ అజిత్ బాబు, డాక్టర్ అమృత, డాక్టర్ సింధూజ పాల్గొన్నారు.

భోగాపురం.. అంగన్వాడీ స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ : మండలంలోని రఘుమండ గ్రామంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మునాయుడు, సర్పంచ్ గూడేల విష్ణు, ఎంపిడిఒ డిడి స్వరూపరాణి, మోపాడ, డెంకాడ వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేపాడ : మండలంలో డబ్బిరాజుపేట గ్రామంలో సర్పంచ్ దండుపాటి ముత్యాలమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపిపి డి.సత్యవంతుడు ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి శానాపతి అప్పలనాయుడు, మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, తహశీల్దార్ ప్రసన్నకుమార్, ఎంపిటిసి చామంతుల లక్ష్మి పాల్గొన్నారు.

అధికారులు ఫుల్... సభ్యులు నిల్

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

సభ్యుల గైర్హాజరుతో ఖాళీగా ఉన్న కుర్చీలు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. సుమారుగా అన్ని శాఖల అధికారులు హాజరైనప్పటికి ఎంపిపి గేదెల శ్రీనివాసరావుతో సహా కొంతమంది సర్పంచులు, ఎంపిటిసిలు గైర్హాజరయ్యారు. సమావేశ సమయానికి కొట్యాడ సర్పంచ్ కొట్యాడ దేవి హాజరైనప్పటికీ మిగిలిన సభ్యులు రాకపోవడంతో గంటన్నర పాటు ఆలస్యంగా సమావేశం మొదలైంది. ఆరుగురు సర్పంచులు, ఇద్దరు ఎంపిటిసిలు, కో ఆప్షన్ సభ్యులు షేక్ ఖాసిం హాజరయ్యారు. వచ్చినవారు కూడా వెనుతిరగడంతో కొట్యాడ, మల్లివీడు , తామరాపల్లి , గంగుపూడి పంచాయతీల సర్పంచులు కొట్యాడ దేవి, ఆదిరెడ్డి అర్జున్, ముత్యం భాస్కరరావు, జి.హరిప్రసాద్, రేగ ఎంపిటిసి బొడ్డు గణపతి మాత్రమే చివరి వరకు ఉన్నారు.

ఎంపిడిఒ కె.రూపేష్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి వైస్ ఎంపిపి ఆవాల శ్యామల అధ్యక్షత వహించారు. గత సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చిన సమస్యలు ఎంతవరకు పరిష్కారం జరిగాయని ఆరా తీశారు. కొట్యాడ సర్పంచ్ దేవి మాట్లాడుతూ పంచాయతీలో 30 మంది జగనన్న గృహ లబ్ధిదారులకు స్థలం చూపించలేదన్నారు. జగనన్న లేఔట్‌లో మద్దిల అప్పారావు అక్రమంగా వేసిన రేకుల షెడ్డు తొలగించాలని కోరారు. మహామాయ , గోల్డ్ స్టార్ పరిశ్రమల ద్వారా వెదజల్లుతున్న కాలుష్యం కారణంగా పంట పొలాలు, చెరువులు నాశనం అవుతున్నాయని తామరాపల్లి సర్పంచ్ ముత్యం భాస్కరరావు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి సర్వసభ్య సమావేశంలోనూ ఈ సమస్య ప్రస్తావించినా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఈ సమావేశంలో ఎంఇఒ సిహెచ్ కూర్మారావు, పిహెచ్‌సి వైద్యాధికారి పివి మురళీకృష్ణ, ఎఒ స్వాతి, పశు వైద్యాధికారి గాయత్రి, హౌసింగ్ ఎఇ సత్యనారాయణ, ఎపిఎం అప్పలనాయుడు, ఎపిఒ విజయలక్ష్మి పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రశ్నిస్తే సహించలేకపోతున్న కేంద్రం

ప్రజాశక్తి - బొబ్బిలి

ప్రజాస్వామ్యంలో ప్రశ్నిస్తే మోడీ ప్రభుత్వం సహించలేకపోతోందని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. న్యూస్‌క్లిక్ జర్నలిస్టులపై ఉపా చట్టాన్ని మోపి, జైల్లోపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ పట్టణంలోని కోరాడ వీధిలో సిఐటియు ఆధ్వర్యాన మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్ హింసలో ఉదాసీనతకు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కారణమని ప్రపంచానికి తెలియజేసిన న్యూస్ క్లిక్‌పై దాడులు చేయించడం దారుణమన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతిపక్ష పార్టీలను సైతం తప్పుడు కేసులు బనాయించి లొంగదీసుకుంటోందని మండిపడ్డారు. పాలకులు చేస్తున్న తప్పులను ప్రశ్నించేవారిని దేశద్రోహం కేసులు, బెయిల్ రాని సెక్షన్లు పెట్టి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని విరుచుకుపడ్డారు. ఇది ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదమని ఆందోళన వ్యక్తంచేశారు. బిజెపి దుర్మార్గాన్ని ప్రజలందరూ తీవ్రంగా ఖండించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.యుగంధర్, జి.గౌరీ, జి.శంకర్రావు కార్మికులు పాల్గొన్నారు.

బాబు అరెస్టు కాదు.. అభివృద్ధి అరెస్టు

వాజీ ఛానల్ ఎమ్‌డి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం కోట

నేడు జరిగింది చంద్రబాబు నాయుడు కాదని, రాష్ట్ర అభివృద్ధిని అరెస్టు చేశారని టిడిపి సీనియర్ నాయకులు, వాజీ ఛానల్ ఎమ్‌డి గణపతినీడి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం సాయంత్రం తన నివాసం వద్ద చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా సహస్ర దీపార్చన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సహస్ర దీపాలంకరణ చంద్రబాబు జైల్లో నుంచి ఆయురారోగ్యాలతో, ఎటువంటి ఆరోపణలు లేకుండా బయటకు రావాలని కోరుతూ చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన చంద్రబాబును జైలులో పెట్టి పైశాచిక ఆనందం పొందుతున్నారని అన్నారు. అభివద్ధి చేసిన నాయకులు జైల్లో ఉంటున్నారని, అవినీతి, అక్రమాలు చేసిన నాయకులు బయట తిరుగుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో కుటుంబ రావు, విజయనగరం న్యాయం విభాగం అధ్యక్షుడు రవిశంకర్, పట్టణ మహిళా అధ్యక్షురాలు కె.రాజ్యలక్ష్మి, కార్పొరేటర్ కె.రాధామణి తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలో నిరసన చేపడుతున్న టిడిపి నాయకులు శ్రీనివాసరావు, తదితరులు

రామభద్రపురం : టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక చొక్కాపువాని చెరువులో అర్ధనగ్నంగా జలదీక్ష చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కరణం విజయ భాస్కరరావు, చిన్నమ్మ తల్లి, పూడి రామినాయుడు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజాక్షేత్రంలోకి

శృంగవరపుకోట : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అరెస్ట్‌కు నిరసనగా 28 రోజులపాటు రిలే నిరాహార దీక్షలు నిర్వహించామని, బుధవారం నుంచి ప్రజాక్షేత్రంలోకి వెళ్లి వైసిపి ప్రభుత్వం దుర్మార్గాలను అరాచకాలను తెలియజేస్తామని ఆ పార్టీ నాయకులు తెలిపారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో నియోజవర్గంలోని మండల పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయుకులు విలేకర్లతో మాట్లాడారు. బుధవారం నుండి గ్రామ గ్రామాలలో ఉన్న ప్రజలను చైతన్య పరుస్తూ ప్రజాక్షేత్రంలోకి వెళ్తామని తెలిపారు. సమావేశంలో నాలుగుబిల్లి ఎంపిటిసి రాయవరపు చంద్రశేఖర్, లగుడు రవికుమార్, గొరపల్లి రాము, రెడ్డి పైడిబాబు, బండారు పెదబాబు, గుమ్మడి భారతి, జుత్తాడ రామసత్యం, ఆడారి రమేష్, ఎం.మంగరాజు పాల్గొన్నారు.

మంచి మనసు చాటుకున్న శివరామకృష్ణ

ప్రజాశక్తి-బొండపల్లి

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని చికిత్స కోసం ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించడమే కాకుండా ఆర్థిక సాయం చేసి మంచి మనసు చాటుకున్నారు.. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం శివరామకృష్ణ. చంద్రబాబు అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా గజపతినగరంలో కరణం శివరామకృష్ణ తమ గ్రూపు నాయకులతో కలిసి దీక్ష చేపట్టారు. ఇటీవల గజపతినగరం మండలం పురిటిపెంట గ్రామానికి చెందిన బంగరాల సన్యాసిరావు ద్విచక్రవాహనంపై వస్తుండగా దీక్షా శిబిరానికి సమీపంలో 26వ నంబర్ జాతీయ రహదారిపై ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలతో ఉన్న సన్యాసిరావును చూసి దీక్షా శిబిరంలో కూర్చున్న కరణం శివరామకృష్ణ తక్షణమే స్పందించారు. విజయనగరంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో స్వయంగా చేర్పించి, మానవత్వం చాటుకున్నారు. చికిత్స అనంతరం ఆస్పత్రి ఖర్చుల కింద గాయపడిన సన్యాసిరావుకు శివరామకృష్ణ రూ.10 వేలు నగదు అందజేసి, ఆపన్న హస్తం అందించారు. దీంతో సన్యాసిరావు కుటుంబసభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రమాదంలో ఉన్న వ్యక్తిని చికిత్స కోసం తానే స్వయంగా ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించి మానవత్వం చూపడమే కాకుండా, ఆపదలో ఆపన్న హస్తం అందించిన కరణం శివరామకృష్ణను పలువురు అభినందిస్తున్నారు.

గాయపడిన వ్యక్తికి నగదు అందజేస్తున్న కరణం శివరామకృష్ణ

ఫ్రెండ్లీ పోలీసింగ్‌కే ప్రథమ ప్రాధాన్యత

డిఎస్‌పి శ్రీధర్

ప్రజాశక్తి-రామభద్రపురం

ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానానికే ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని బొబ్బిలి డిఎస్‌పి శ్రీధర్ ఆదేశించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైపాస్ జంక్షన్ వద్ద నిర్వహిస్తున్న చెక్ పోస్ట్ సత్ఫలితాలు ఇస్తుందన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే మాదకద్రవ్య రవాణా పూర్తి అదుపులో ఉందన్నారు. నిరంతర గస్తీ ఏర్పాట్ల వల్ల డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిబుల్ డ్రైవింగ్ అదుపులోకి వచ్చిందన్నారు. విజిబుల్ పోలీసింగ్ విధానం ద్వారా దోపిడీ, దొంగతనాలు, ర్యాగింగ్ వంటి వాటిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. బహిరంగ, దాబా, హోటల్, లాడ్జిల్లో మద్యం విక్రయాలు, మద్యపానానికి అనుమతిస్తే వాటి నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మూడు రోడ్ల జంక్షన్ వద్ద ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టామని, దీనికి వ్యాపారులు, ప్రజలు సహకరించాలని కోరారు. నక్సల్స్ కదలికలు పూర్తిగా కనుమరుగయ్యాయని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సమావేశంలో సిఐ తిరుమలరావు, ఎస్ఐ సురేంద్రనాయుడు పాల్గొన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న డిఎస్‌పి శ్రీధర్

వంగర : మహిళలపై నేరాలు జరగకుండా వారికి రక్షణగా ఉండేందుకు ప్రత్యేక దృష్టిసారిస్తామని రాజాం రూరల్ సిఐ ఎస్.శ్రీనివాస్ అన్నారు. వంగర పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. అన్ని రూములను క్షుణ్ణంగా పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. ఎస్ఐ ఆర్.జనార్దనరావు, పోలీస్ సిబ్బందితో సమావేశం నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విధుల నిర్వహణపై సూచనలు ఇచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బాలికల పైన, మహిళలపైన నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన దిశ యాప్‌పై గ్రామాల్లో, పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పేకాట, కోడిపందాలు వంటివి నిర్వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో హెచ్‌సిలు డి.రాములు, నాయుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ధూళి ఎగరకుండా వాటరింగ్

ప్రజాశక్తి-బొబ్బిలి

పూల్‌బాగ్ రహదారి పాడై గోతులతో వాహనదారులు, ప్రయాణికులు ఒకవైపు ఇబ్బందులు పడితే, దుమ్మి, ధూళితో మరోవైపు అవస్థలు పడుతున్నారు. పూల్‌బాగ్ రహదారిపై వాహనాల రద్దీ పెరగడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ సమస్యను టిడిపి నాయకులు బొత్స అప్పులు.. మున్సిపల్ మాజీ చైర్మన్ బేబినాయన దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే ఆయన స్పందించి, సొంత వాటర్ ట్యాంకరుతో రహదారిపై వాటరింగ్ చేయిస్తున్నారు. దీంతో ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మొక్కలు నాటిన జియో

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని ఓబలయ్యపాలెంలో జియో (గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్) ఆధ్వర్యాన మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జియో వ్యవస్థాపకులు రామకృష్ణ మాట్లాడుతూ శుభకార్యాలలో మొక్కలు నాటడం వల్ల పర్యావరణాన్ని కాపాడుకునే అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రతినిధి వనిత, వి.సుశీల, రిషికేశ్, లాస్యశ్రీ, డిపి చంద్రశేఖర్, విఆర్ఒ పి.శివకృష్ణ, సిహెచ్ శ్రీరాములు, సిమ్మ అప్పల రాము పాల్గొన్నారు.

మొక్క నాటుతున్న జియో సభ్యులు

నేరాలు ఘోరాలు

కడుపు నొప్పి భరించలేక వృద్ధుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-రామభద్రపురం

మండల కేంద్రం మూడడ్ల వీధికి చెందిన మూడడ్ల సన్యాసినాయుడు (62) కడుపునొప్పి భరించలేక తన ఇంట్లో మేడ మీద పురుగు మందు తాగి మృతి చెందినట్లు ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపారు. ఆయన గత కొన్నేళ్లుగా కడుపు నొప్పితో బాధ పడుతూ మందులు వాడుతున్నారు. ఈ క్రమంలో బాధ తగ్గక రోజు రోజుకు ఎక్కువ కావడంతో భరించ లేక సోమవారం పురుగు మందు తాగేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన బాడంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స చేసినా పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ నిందితుడు అరెస్టు

విజయనగరం : నగరంలోని గురజాడ అప్పారావు రోడ్డులో బొంత రాజేష్‌కు చెందిన ప్లేస్టోర్ మొబైల్‌షాప్‌లో జులై 23న చోరీకి పాల్పడిన నిందితుడిని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఆరోజున షాపును తన మేనల్లుడు గౌతమ్‌కు అప్పగించి బయటకు వెళ్లగా, గుర్తు తెలియని వ్యక్తి హెల్మెట్ ధరించి, షాపులోకి ప్రవేశించి, తన మేనల్లుడు గౌతంను కొట్టి రెండు మొబైల్ ఫోన్లను పట్టుకొని పరారయ్యాడు. రాజేష్ ఇచ్చిన ఫిర్యాదుపై వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. దుప్పాడ గ్రామానికి చెందిన గండిపల్లి ప్రసాద్ చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించి, అతని కదలికలపై నిఘా పెట్టారు. ఈనెల 9న నిందితుడిని పంచముఖ ఆంజనేయ స్వామి కోవెల వద్ద అరెస్టు చేసి, అతని నుంచి మొబైల్స్‌ను రికవరీ చేశారు. నిందితుడిని రిమాండుకు పంపినట్లిగా వన్ టౌన్ సిఐ బి.వెంకటరావు తెలిపారు.

BEFORE THE HON'BLE A.P. STATE CONSUMER DISPUTES REDRESSAL COMMISSION : KRISHNA AT VIJAYAWADA

F.A. No. 55 of 2023

Between :
Authorised person, Customer Assistance Centre, TATA Motors Limited, Ahuja Centre, 4th Floor, 83, Mahakali Caves Road, Andheri Medi, Andheri East, Mumbai - 400093 .... Appellant

And

Sri chodi Nagaraju & another ... Respondents

To,
Sri Chodi Nagaraju, S/o Late Appala Naidu, R/o H.No. 3-30, Yeguva Veedhi, Venkampeta, Makkuva Mandal, Vizianagaram District.... Respondent No.1

పై నెంబరు దావాలో ఫస్ట్ రెస్పాండెంట్ హాజరు నిమిత్తం పై కోర్టు వారు ది. 31-10-2023వ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున పై రెస్పాండెంటు పైన తెలిపిన కోర్టుకి ది. 31-10-2023 ఉదయం 10-30 గం.లకు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరయి తమ ఆక్షేపణలను తెలుపుకొన గలరు. లేనిపక్షంలో మీ పరోక్షంగా కోర్టువారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదాతేది : 31-10-2023

M.V.G.Veerabhadra Rao,
V.Hemalatha,
Advocates,
Vijayawada.
Cell : 9573397368